# ఉపాయం

రచన :
కె. ఆర్. కె. ప్రసాద్

మాఊరు కుగ్రామం. అక్కడ ఒక్క చిన్న సినిమా థియేటరైనాలేదు. కాని అలాంటి కొరత తీర్చేందుకని అప్పుడప్పుడూ మా గ్రామానికి టూరింగ్‌టాకీసులు వస్తూండేవి. పాతసినిమాలు క్రొత్తసినిమాలు అన్నీ కలిసి ప్రదర్శిస్తూండేవారు. ఇందులో చిత్రమేమిటంటే ఒక కంపెనీ వచ్చి వెళ్లిపోయిన తర్వాత రెండో కంపెనీవారు వచ్చి అవే చిత్రాలను ప్రదర్శిస్తూండేవారు. అందుకని మొదట చూడనివారు రెండోసారి చూసేందుకు అవకాశం వుండేది.

సీను సెకండుఫారం చదువుతూండేవాడు. సీనూకు సినిమాలంటే పిచ్చి కానీ రంగనాధం గారూ, సత్యవతమ్మగారూ సీనూను సినిమాలకి పంపేవారుకారు. చిన్నపిల్లలు సినిమాలు చూస్తే చెడిపోతారని వారి అభిప్రాయం. అందుకనే సీను నిద్రపోయినతర్వాత యిల్లు తాళంవేసి సెకండుషోకి వెళ్లేవారాదంపతులు.

ఈసారి సీతారామాంజనేయ టూరింగ్ టాకీసులో తెనాలి రామకృష్ణ ఆడుతూంది. ఇంతకు ముసుపోసారి ఆ చిత్రం వచ్చినా సీనుమాత్రం చూడలేదు. ఆ చిత్రాన్ని అతని మిత్రబృందమంతా చూశారు. కాని, అందరూ రెండోసారి చూట్టానికని ప్లానులువేసి ఆదివారం మ్యాటినీకి వెళ్లేట్టు నిర్ణయించేశారు. సీనూకి ఈసారైనా తప్పక వెళ్ళాలనిపించింది. కానీ సినిమాకి కావలసిన అరణాలు ఎలా సంపాదించాలన్న సమస్య కూర్చుంది. అయినా ఆదివారంనాటికి అరణాలు చేరవా అని తమాయించుకున్నాడు సీను. ఆదివారం వచ్చింది. కాని అరణాలుమాత్రం రాలేదు. ఆదివారం కావటంచేత రామనాధంగారు యింట్లోనేవున్నారు. మరి అరణాలు ఎలా తేవటం అన్నది అంతుచిక్కని సమస్యగా పరిణమించింది.

పోనీ! ఇంటో ఎక్కడబడితే అక్కడే చిల్లర వుంటుందిగదా! ఒక్క అణారలు కొట్టేస్తే! ఛీ! దొంగతనమా! అనుకుని సీను బాధ పడ్డాడు. ఇంతవఱకు దొంగతనం చేయక పోబట్టి సీనూకి దొంగతనం అంటే భయం వేసింది. అందులోనూ వెధవది సినిమాకని దొంగతనంచేయటం చిన్నతనమనిపించింది. అందుకనే ఎలాగైనా అమ్మనే అడగాలనుకున్నాడు.

మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు. మడికట్టుకుని వున్నందున తాకితే కోప్పడుతుందేమోనని వెనకగా వెళ్లి ఇలా అన్నాడు.

"అమ్మా! స్కూలుపిల్లలందరూ తెనాలి రామకృష్ణసినిమాకి వెళుతున్నారే నేను వెడతాను మాకు తెనాలిరామకృష్ణ పాఠంకూడా వుంది."

"అస్తమానం పలకలకి, పుస్తకాలకి, పెన్సిళ్లకి అడిగేది చాలక సినిమాలకికూడా కావాలా! బావుంది. అయినా నాకెందుకులే! మీ నాన్న గారిని అడిగి వెళ్ళు" అంది.

సీనుకి ఒక్కసారిగా దుఃఖం పొంగుకుంటూవచ్చింది. "ఛీ! ఒక్కసారి సినిమాకి వెడతానంటే కూడా డబ్బులివ్వరు" అనుకున్నాడు.

ముఖం ముడుచుకుని గదిలోకి వెళ్ళాడు. గదిలో సీనూకి బీరువా కనబడింది. బీరువాకు తాళంచెవులగుత్తి అలానే వేలాడుతూ వుంది. చప్పుడుచేయకుండా వెళ్లి డ్రాయర్ లాగిచూశాడు. అందులో బోలెడంత చిల్లర పడివుంది. అమ్మ యింత చిల్లరవుండికూడా ఒక్కకానీ లేదంటుంది అని విసుక్కున్నాడు. పోనీ ఒక్క అరణాలు తీస్తే, అతని మనస్సొప్పలేదు. చేతులు వొణుకుతున్నాయి. గడియారం పదకొండు గంటలు కొట్టింది. అసలే భయంతోవున్న సీనుకు గుండె గుభేల్‌మంది. డ్రాయరు దుబుక్కున మూశాడు. డ్రాయరులో నాన్నగారి పార్కరుపెనా కనబడింది. ఇంతలో అమ్మ అన్నానికని పిలవటంతో వంటింటిలోకి వారితీశాడు.

అన్నం తింటూంటే సీనూకి మెరుపు మెరిసినట్టు ఒక ఉపాయంతోచింది. నాలుగు మెతుకులు ఎంగిలిచేసి భోజనం ముగించాడు. నాన్నగారు అప్పుడే భోజనంచేసి హాలులో తమలపాకులు వేసుకుంటున్నారు. అమ్మ వంటింటిలో సర్దుతూంది.

సీను ఆయన దగ్గఱగా వెళ్లి నేలవేపు చూస్తూ నిలబడ్డాడు.

"ఏం కావాలిరా?" అని అడిగారాయన.

"నాన్నా! మరేం....మరేమునూ నోట్సు రాయాలి నాన్న. అందుకని నీపెన్ను యిస్తే ఫ్రెండిఃటికెళ్లి వ్రాసుకొనివస్తానునాన్నా" అని జవాబిచ్చాడు.

ఆయన మాంచి ఉషారులో వున్నట్టున్నారు.

"డ్రాయరులో వున్నట్టుంది అమ్మనడిగి తీసుకునివెళ్ళు"

సీనుపంట పండింది. ఒక్క గంతేసి ఎగురుతూ వంటయిల్లు చేరుకుని, "అమ్మా! అమ్మా! నాన్నగారు సినిమాకి వెళ్లమన్నారే బీరువా డ్రాయరులోవుందిట నిన్ను యిమ్మన్నారు" అంటూ గుక్కతిప్పుకోకుండా చెప్పాడు.

ఎన్నడూ సినిమాకు పంపంది ఈ దినం వెళ్లమన్నారంటే ఆవిడకు అనుమానంవేసింది.

వంటింటిలోనించే "ఏవండీ వీడి కివ్వమన్నారా" అంది.

"పోనీ యిచ్చేయ్యవే" అన్నారాయన అక్కడనుంచే. సత్యవతమ్మగారికి ఆశ్చర్యంవేసింది. ఏదో ఉషారులో వుండివుంటారనుకుంది. బీరువాదాకా వెళ్లలేక తన బొగ్గిట్లోనేవున్న చిల్లఱలో అరణాలు తీసియిచ్చింది.

"మాఅమ్మ ఎంతమంచిదో! అమ్మా ఇంకో అణా యిచ్చేయ్యవే చేగోడీలు కొనుక్కుని తింటాను అంటూ నసిగాడు.

ఆవిడ అణా తీసియిచ్చింది.

డబ్బు తీసుకుని, నాన్న నమ్మేందుకని పుస్తకం ఒకటి చంకలోపెట్టుకుని తుర్రుమని పోయాడు సీను.

"త్వరగా వచ్చేయ్‌రోయ్" అని హెచ్చరించారు రామనాధంగారు.

"అలాగే అంటూ తన ఉపాయం పారినందుకు మనస్సులో సంతోషించాడు సీను.

"పిచ్చివెధవ! సినిమాఅంటే ఎంత పిచ్చో" అంటూ ఆయనదగ్గరికి వచ్చింది సత్యవతమ్మ గారు.

"సినిమా ఏమిటి? అని తెల్లబోయారు రంగనాధంగారు.

"మీరే యిమ్మంటిరిగా అరణాలు"

హరి! భడవా! నన్ను పెన్ను కావాలని అడిగి నిన్ను సినిమాకి డబ్బులడిగాడా రాని చెబుతా!

"పోనిద్దురూ!" అంటూ తమలపాకుల పళ్లెం తీసుకుంది సత్యవతమ్మ. ★